అంతా 'జూబ్లీహిల్స్' చుట్టే !

- పోటాపోటీగా అధికార, ప్రధాన ప్రతిపక్షాల ప్రచారం
- మంత్రులందరూ క్యాంపెయిన్‌లోనే
- బిఆర్‌ఎస్ నేతలదీ అదే బాట
- సిద్ధాంతాలు మరిచి.. రాద్ధాంతాలకే ప్రాధాన్యం
- విధానాలకు చోటే లేని వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం రసవత్తరంగా మారుతోంది. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల ప్రచారం పోటాపోటీగా సాగుతోంది. నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్... ఈ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం కొనసాగిస్తున్నారు. ఈ ఎలక్షన్‌లో గెలవటం ద్వారా విజయోత్సాహంతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని హస్తం పార్టీ భావిస్తోండగా... తమ సిట్టింగు సీటును కాపాడుకోవటం ద్వారా గత ఓటముల నుంచి బయటపడేందుకు గులాబీ పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతోంది.

అధికార పార్టీ కాంగ్రెస్... మంత్రులు గడ్డం వివేక్, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావును ఈ ఉప ఎన్నికకు ఇన్‌ఛార్జిలుగా నియమించింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం ఏడు డివిజన్లు ఉండగా, ఒక్కో డివిజన్‌కు ఇద్దరేసి మంత్రులకు బాధ్యతలను అప్పగించారు. దీంతో అమాత్యులందరూ క్షేత్రస్థాయిలో ప్రచారపర్వంలో మునిగిపోయారు. ఫలితంగా సచివాలయంలో కార్యకలాపాలు మందగించాయి. ఒకరిద్దరు మంత్రులు అడపాదడపా వచ్చి సమీక్షలు నిర్వహిస్తున్నారే తప్ప పూర్తి స్థాయిలో దృష్టి సారించటం లేదు. ప్రధాన ప్రతిపక్షం నుంచి ప్రచార బాధ్యతలను భుజానికెత్తుకున్న కెటిఆర్... ఈ ఉప ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌ను ఎలా గెలిపించి తీరాలనే పట్టుదలతో ఉన్నారు. అందుకే పార్టీలోని మాజీ మంత్రులు, మాజీ ఎంపిలు, ప్రస్తుత ఎమ్మెల్యేలకు పూర్తిస్థాయిలో బాధ్యతలను అప్పగించారు. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లను రంగంలోకి దించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావటం లేదని పేర్కొంటూ ఇటీవల విడుదల చేసిన 'బాకీ కార్డు'తో



వారు ప్రతీ గడపకూ వెళుతున్నారు.

కాగా... అటు కాంగ్రెస్, ఇటు బిఆర్‌ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. 'సొంత చెల్లినే ఇంట్లోంచి గెంటేశారు.. ఇక రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ఏం న్యాయం చేస్తారు...' అంటూ సిఎం రేవంత్, కెటిఆర్‌పై విమర్శల బాణం ఎక్కుపెడితే.. 'రేవంత్ రాష్ట్రంలోని మహిళలందరికీ ధమ్కీ ఇచ్చారు...' అంటూ కెటిఆర్ దెప్పిపొడిచారు. వీరిరువురి మాటలు, ప్రసంగాల్లో ఎక్కడా విధానాల గురించి గానీ, అభివృద్ధి గురించి గానీ ప్రస్తావన లేకపోవటం గమనార్హం. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏలాంటి కార్యక్రమాలు చేపట్టామనే విషయంపై కాంగ్రెస్ నేతలు నోరు మెదపటం లేదు. తమ హయాంలో తీసుకొచ్చిన మార్పులు, సంస్కరణల గురించి బిఆర్‌ఎస్ నాయకులు మాట్లాడటం లేదు. ఈ అంశాలన్నింటినీ పక్కనబెట్టి... ప్రజలను తమవైపు తిప్పుకోవటం, మీడియాలో ఆర్భాటపు ప్రచారం, హైప్ కోసమే లీడర్లు పాకులాడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'రాజకీయమంటే రాద్ధాంతం కాదు.. సిద్ధాంతం...' అనేది మాజీ సిఎం కామరాజ్ నాడార్ చెప్పిన మాట ఇది. కానీ నేటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నేతలు సిద్ధాంతాలను పక్కనబెట్టి, రాద్ధాంతాలకే ప్రాధాన్యతనిస్తున్నారు.

ఖర్చు రూ.300 కోట్లు పైమాటే...

మరోవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అత్యంత ఖరీదైన ఎన్నికగా మారనుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి... ఇప్పటికే డబ్బును మంచినీళ్ల ప్రాయంలాగా ఖర్చు చేస్తున్నాయి. ఈ మూడు పార్టీలు కలిసి రూ.300 కోట్లకు పైగానే కుమ్మరించనున్నాయని వినికిడి. ఎలక్షన్ తేదీ దగ్గర పడుతున్నకొద్దీ ఇక్కడ డబ్బు... వరదలా ప్రవహించనుంది.

రసాయన పరిశ్రమలో అగ్నిప్రమాదం

- భారీగా మంటలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని ఓ మూతపడ్డ పరిశ్రమలో నిల్వ ఉంచిన డ్రమ్ములు బ్లాస్ట్ అయ్యి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో పటాన్‌చెరు పట్టణ శివారులో కొంతకాలంగా మూతబడిన రసాయనిక పరిశ్రమలో ఒక్కసారిగా



మంటలు ఎగిసి పడటంతో చుట్టుపక్కల పరిశ్రమలతో పాటు పక్కనే ఉన్న కాలనీవాసులు భయాందోళనలకు గురయ్యారు. కిలోమీటర్ల మేర పొగతో కమ్ముకుపోయి రసాయనాల ఘాటు వాసనలతో పక్కనే ఉన్న సీతారామపురం, గౌతమ్ నగర్ కాలనీవాసులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. విషయం తెలుసుకున్న పటాన్ చెరు ఫైర్ స్టేషన్ సిబ్బంది ఏడు ఫైరింజన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. పటాన్‌చెరు డిఎస్‌పి ప్రభాకర్ పర్యవేక్షణలో సీఐ వినాయక్ రెడ్డి డివిజన్ పరిధిలోని సీఐలు సిబ్బంది పరిశ్రమ వద్దకు చేరుకొని మంటలను అదుపు చేసే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశ్రమ వద్దకు చేరుకొని పర్యవేక్షణ చేస్తున్నారు. నిలువ ఉంచిన డ్రమ్ముల్లో నుంచి మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్ర ప్రభుత్వం

- రిజర్వేషన్లపై కలిసొచ్చే పార్టీలతో కలిసి సిఎం ఢిల్లీలో పోరాడాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పెద్ద రాములు సంస్మరణ సభ ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసి అసెంబ్లీలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తీర్మానం చేసిందని తెలిపారు. దాన్ని గవర్నర్ ఆమోదం కోసం పంపితే.. ఆయన దాన్ని ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టారని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, బిసి సంఘాలు, ప్రజా సంఘాలు బీసీ రిజర్వేషన్లు అమలు కోసం బంద్ చేపడితే బిజెపి కూడా రాష్ట్రంలో బంద్‌లో పాల్గొనడం బిసిలను మోసం చేస్తూ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నదని విమర్శించారు. 42శాతం రిజర్వేషన్లలో ముస్లింలూ ఉన్నారని, అందుకే అమలు చేయడం లేదని గతంలో బండి సంజయ్ ప్రకటించడం దారుణమన్నారు. ముస్లింలోనూ వెనుకబడ్డ పేదలు ఉన్నారని, వారికీ వాటా ఇవ్వడంలో తప్పులేదని, మతం పేరుతో రిజర్వేషన్లు అడ్డుకుంటూ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తున్నప్పుడు.. మన రాష్ట్రంలో ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర సిఎం బిసి రిజర్వేషన్లు తీర్మానం చేసి పంపడం కాకుండా రాష్ట్రంలో కలిసొచ్చే అఖిలపక్ష పార్టీలతో ఢిల్లీలో పోరాటానికి నాయకత్వం వహించాలని సూచించారు. దానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, అధికారంలోకి రాగానే జాబ్ క్యాలండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి మరిచిందని అన్నారు. నిరుద్యోగ జేఏసీ ఉద్యోగాల కోసం చేపట్టే ఆందోళన పోరాటాలకు సిపిఎం మద్దతు తెలుపుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ జబ్బార్, జీఎస్ గోపి, రాజు మండల కార్యదర్శి డి.బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు అనుమానమే

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అన్ని హద్దులుమీరి వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఎంఐఎం అభ్యర్థిని అద్దెకు తెచ్చుకున్నా...అజహరుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చినా... ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందా? అనే అనుమానం కలుగుతున్నదని చెప్పారు. ఆ భయంతోనే కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ప్రకటన జరిగిన రోజే మజ్లిస్ పార్టీ ఒత్తిడిమేరకు మెహిదీపట్నంలో ఖబరస్థాన్ కోసం విలువైన ఆర్మీ స్థలాన్ని కేటాయించిందని చెప్పారు. ఎర్రగడ్డ కాలనీలు, బస్తీల మధ్య మరో స్థలాన్ని ఇవ్వడం, ఇతర తాయిలాలతో ముస్లింలను బుజ్జగిస్తూ.. ఇతర వర్గాలను మాత్రం బెదిరిస్తోందన్నారు. సన్న బియ్యం ఇవ్వడం మానేస్తామంటూ సిఎం బెదిరింపులకు దిగడం సరైందికాదన్నారు. ఉపఎన్నికలో ఓడిపోతామనే ఫ్రస్టేషనా? లేక కాంగ్రెస్ మార్క్ రాజకీయమా? అర్థం కావడం లేదని చెప్పారు. ప్రతి కేజీ బియ్యానికి కేంద్రం రూ.42లు ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేవలం 15 రూపాయలు మాత్రమే ఇస్తోందని గుర్తు చేశారు. ఆరు గ్యారెంటీలు, 420 సబ్ గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కారు అట్టర్ ఫ్లాప్ అయిందని విమర్శించారు. సైనికులను కించపరిచేలా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సూర్యాపేటలో 28న కల్లుగీత కార్మికుల రణభేరి

- కార్మిక హక్కుల సాధనకు ఏకమవ్వాలి
- కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభను పోరాటాల పురిటి గడ్డ సూర్యాపేట పట్టణంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎంవి రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్గూరి గోవిందు అధ్యక్షతన జరిగిన ఆహ్వాన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. 28వ తేదీన జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. 1957లో ఉమ్మడి రాష్ట్రంలో కల్లుగీత కార్మిక సంఘం ఏర్పడిందని అన్నారు. ఈ 68 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించామని తెలిపారు. సొసైటీలు, టిఎఫ్‌టిలు, పెన్షన్, ఎక్స్‌గ్రేషియా లాంటి హక్కులు సాధించుకున్నామన్నారు. కల్లు గీత వృత్తిపై రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. వారి సమస్యలపై పాలకులు దృష్టి పెట్టడంలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. అధికారులకు, మంత్రులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.4000, ఎక్స్‌గ్రేషియా రూ. పది లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల



మాట్లాడుతున్న ఎంవి రమణ

నివారణకు వృత్తి చేసే వారందరికీ జాప్యం లేకుండా కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని కోరారు. ప్రమాదానికి గురైన గీత కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని, నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, తదితర సమస్యలపై పోరాటాల రూపకల్పనతో పాటు గత మూడేళ్లలో చేసిన ఉద్యమాలపై సమీక్షించుకునేందుకు ఈ మహాసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి, సంఘం జిల్లా కార్యదర్శి పల్చ మల్సూర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోలిశెట్టి యాదగిరిరావు, వికలాంగుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు వీరబోయిన వెంకన్న, మత్స్య కార్మిక సంఘం జిల్లా నాయకులు మేకనబోయిన శేఖర్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ అధికారులు మనసుతో పనిచేయాలి

- ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్

ప్రజాశక్తి - కల్చరల్

సివిల్ సర్వీస్ అధికారులు కేవలం రూల్ బుక్‌కి పరిమితమై పనిచేస్తే వారి ముద్ర వారు పని చేసిన శాఖపై అంతగా ఉండదని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ అమ్మంగి వేణు గోపాల్ అన్నారు. వారు మనసు పెట్టి సామాజిక శ్రేయస్సుకు పని చేసేవారనే తరతరాలు గుర్తుచేసుకుంటారని చెప్పారు. తెలంగాణ సాహిత్య అకాడమీ నిర్వాహణలో సాహిత్య వారం కార్యక్రమంలో భాగంగా రవీంద్ర భారతి సమావేశ మందిరంలో డాక్టర్ కెవి రమణ రచించిన హరే శ్రీనివాస పుస్తక పరిచయం సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వేణు గోపాల్ మాట్లాడుతూ రమణాచారి రాష్ట్ర ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉన్నత అధికారిగా వివిధ శాఖలలో పని చేశారని, ఆయన ఎక్కడ పని చేసినా నిబంధనలు అతిక్రమించకుండా తన సృజనాత్మక ప్రతిభతో ప్రజోపయోగమైన ప్రణాళికలు రూపొందించి అప్పటి పాలకుల సమ్మతి పొందారని చెప్పారు. అందులో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం కార్య నిర్వహణ అధికారిగా ఆయన చేపట్టిన కార్యక్రమాలు ఆచరణలో ఎదుర్కొన్న కష్టాలు అవాంతరాలు దాటి విజయం సాధించిన సంఘటనల అనుభవమే 'గుచ్చం హరే శ్రీనివాస' సంపుటి అని అన్నారు. శ్రీ వెంకటేశ్వర భక్తి చానెల్ ఎన్ని అడ్డంకులు అధిగమించి దేశ వ్యాప్తంగా స్వామి సేవలని ప్రజల్లో తీసుకు వెడుతున్న నేపథ్యం వెనుక రమణాచారి ధృఢ దీక్ష అంకిత భావం సంపుటి చదివిన వారికి అర్థం అవుతుందని కొనియాడారు దూరదర్శన్ కార్యక్రమ పూర్వ నిర్వహణ అధికారి డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ హరే శ్రీనివాస సంపుటిలో ప్రతి అధ్యాయం ప్రతి వారికి ప్రేరణ ఇస్తుందని అన్నారు. అసాధ్యం అనుకున్నవి సాధ్యం చేయటంలో రమణాచారి పాలన నైపుణ్యం తెలుస్తుందని కాని అవన్నీ శ్రీనివాసుని కృప అని ముగింపు ఇవ్వడంలో ఆయన నిరాపేక్ష కర్మకి నిదర్శనమని అన్నారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ బాలాచారి అధ్యక్షత వహించిన సభలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

టిసాట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిసాట్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 1 నుంచి 4 వరకు మండల స్థాయిలో, 5వ తేదీ నుంచి 8 వరకు జిల్లా స్థాయిలో, 9, 10 తేదీల్లో జోనల్ స్థాయిలో, 12, 13 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో పోటీలుంటాయి. తెలుగు, ఇంగ్లీష్‌లో బాలవక్త ఉపన్యాసం, వ్యాసరచన పోటీలతో పాటు జనరల్ నాలెడ్జ్, అకడమిక్స్, కరెంట్ అఫైర్స్‌లో క్విజ్ పోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా షెడ్యూల్‌ను ప్రతి పాఠశాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదివారం పాఠశాల విద్య సంచాలకులు ఇ.నవీన్ నికోలస్ జిల్లాల డిఇఒలను ఆదేశించారు.

నేడు ఏరియల్ ఎలక్ట్రోమైగ్నెటిక్ సర్వే

- ప్రారంభించనున్న సిఎం, మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ కోసం ఉద్దేశించిన ఏరియల్ ఎలక్ట్రోమైగ్నెటిక్ సర్వేను ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి, సాగునీటిశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించనున్నారు. నల్లగొండ జిల్లాలో మూడు లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు తాగునీరు ఇచ్చే ఉద్దేశంతో ఈ టన్నెల్ నిర్మాణం మొదలు పెట్టారు. ఇంకా దాదాపు 9.8 కిలోమీటర్ల టన్నెల్ పూర్తి కావాల్సి ఉంది. టన్నెల్ పూర్తి కాకపోవడంతో ప్రతి ఏటా వాటర్ పంపింగ్ కోసం ప్రభుత్వం రూ.500 కోట్ల విద్యుత్ బిల్లులను చెల్లించాల్సి వస్తున్నది. దీనిని పొదుపు చేసేందుకు టన్నెల్‌ను పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఇది పూర్తి చేసే క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 22న జరిగిన దుర్ఘటనతో ప్రభుత్వం ఉన్నత స్థాయి సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సుస్థిర నిర్మాణం కోసం ఆధునాతన శాస్త్రీయ సాంకేతికతను వినియోగించాలని సూచించింది. దీనిని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించింది. 2028 జూన్ నాటికి టన్నెల్‌ను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకోసం ఆధునాతన సాంకేతికత అయిన హెలీ బోర్న్ ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ సర్వేను వినియోగిస్తున్నది. ఈ సర్వే 200 కిలోమీటర్ల మేరకు నిర్వహించనున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ చైర్మన్‌గా ప్రొఫెసర్ కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్‌గా ప్రొఫెసర్ ఎం కోదండరాంను ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్ నాంపల్లిలోని టిజెఎస్ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ సంఘాలు, తెలంగాణ టిజెఎసి సంఘాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉద్యమకారులు తమ ఆకాంక్షల సాధన కోసం, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం కోదండరాం నేతృత్వంలో పని చేస్తామని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం తక్షణమే గుర్తింపునిస్తూ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ నెలలో ఉమ్మడి పది జిల్లాలలో ఉద్యమకారుల సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి జిల్లా స్థాయిల్లో సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. డిసెంబర్ 3న శ్రీకాంతాచారి వర్ధంతి సభను ఎల్బీనగర్‌లో ఉద్యమకారుల సమక్షంలో నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ నెలలో హైదరాబాదులో రాష్ట్రస్థాయి ఉద్యమకారుల సదస్సు ఏర్పాటు చేయాలని ఈ సదస్సు తీర్మానించినట్టు కోదండరాం ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడానికి తెలంగాణ ఉద్యమకారులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి ఆ సమావేశానికి ప్రభుత్వ పెద్దలను ఆహ్వానించి మాట్లాడిస్తామని ఆయన తెలిపారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, అమరవీరుల కుటుంబాలకు అండగా తదితర సమస్యలను ఈ కమిటీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఆయన వెల్లడించారు. ఈ సమన్వయ కమిటీ సమావేశానికి తెలంగాణ ఉద్యమకారుడు, జర్నలిస్టు ఎం.నరసయ్య అధ్యక్షత వహించగా వివిధ తెలంగాణ ఉద్యమ సంఘాల నాయకులు, టి జెఎసి ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు కాచం సత్యనారాయణ, సుల్తాన్ యాదగిరి, రామగిరి ప్రకాష్, పూస శ్రీనివాస్, తెలంగాణ వెంకన్న, తుల్జా రెడ్డి, బండి రమేష్, కుమారస్వామి, లక్ష్మారెడ్డి, నిజ్జన రమేష్, అశోక్ రెడ్డి, శ్యాంసుందర్ గౌడ్, తెలంగాణ కొమరయ్య, అంజిరెడ్డి, రూబీ, పాండు, శ్రీనివాస్, యాదగిరి, మల్లేష్, తోటనరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గానికి ప్రమాద ఘంటికలు

- కొత్త విధానం కార్పొరేట్ల కోసమే..
- మనుస్మృతి ప్రేరణతో రాజ్యాంగ స్ఫూర్తికి తిలోదకాలు
- దాడి' సెమినార్‌లో తపన్‌సేన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మోడీ సర్కారు తీసుకొస్తున్న కొత్త కేంద్ర కార్మిక విధానం శ్రమ శక్తి నీతి 2025తో మొత్తం కార్మిక వర్గానికి ప్రమాద ఘంటికలు మోగనున్నాయి. ఈ విధానం కార్మికులకు అత్యంత ప్రమాదంగా, అప్రజాస్వామికంగా ఉన్నది. దీన్ని మనుస్మృతి ప్రేరణతో తీసుకొస్తున్నామంటూ చెబుతున్న కేంద్రం రాజ్యాంగ విలువల వలవలూడదీస్తున్నది. కార్మిక సంఘాలతో చర్చించకుండా కార్మిక ప్రయోజనాలను కాపాడుతున్నామనే పేరుతో వారి మెడకు ఉరి తాడు పేనుతున్నది. పోరాడి సాధించుకున్న చట్టాలకు తిలోదకాలిస్తున్నది. కార్పొరేట్ల ప్రయోజనాలే పరమావధిగా కేంద్రం విధానాలను రూపొందిస్తున్నది'.అని సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన 'కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన లేబర్ పాలసీ శ్రమ శక్తి నీతి- 2025, కార్మిక వర్గంపై దాడి' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. తపన్‌సేన్‌తో పాటు సిఐటియు జాతీయ కార్యదర్శి కె ఉమేశ్, కోశాధికారి ఎం సాయిబాబు, సీనియర్ నాయకులు ఆర్ సుధాభాస్కర్ మాట్లాడారు.

తపన్‌సేన్ మాట్లాడుతూ పెట్టుబడి దారి వ్యవస్థ తీవ్ర సంక్షోభ స్థితిలో ఉన్నప్పుడు కార్పొరేట్లు తమ లాభాలను మరింత ఎక్కువగా పిండుకోవాలని చూస్తారన్నారు. అందుకనుగుణంగా బిజెపి ప్రభుత్వం శ్రమ శక్తి నీతి- 2025 పేరుతో కేంద్ర కార్మిక కొత్త విధానాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టిందని తెలిపారు. దేశ ఉత్పాదనలో కీలక పాత్ర నిర్వహిస్తున్న కోట్లాది మంది కార్మికులకు సంబంధించిన విధానాన్ని రూపొందించే క్రమంలో కార్మిక సంఘాలతో కనీసం సంప్రదింపులు చేయకపోవటం అప్రజాస్వామిక చర్యకాక మరేమిటని ప్రశ్నించారు. 2019-20లో 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకు రావటంతో పాటు శ్రమశక్తి నీతి-2025 తీసుకురావటం అనేది నయా ఉదారవాద విధానాల్లో భాగమేనని చెప్పారు. ఆరేళ్లుగా లేబర్ కోడ్‌లను నిలుపుదల చేయాలని కార్మిక సంఘాలు ఆందోళన



సెమినార్‌లో మాట్లాడుతున్న తపన్‌సేన్

చేస్తున్నాయని గుర్తు చేశారు. వాటిని కేంద్రం రద్దు చేయకపోగా బిజెపీయేతర ప్రభుత్వాలతో పాటు తమ ప్రభుత్వాల్లో వాటి తక్షణ అమలు కోసం విధానాల రూపకల్పన చేసేందుకు ఒత్తిడి చేస్తున్నదని తెలిపారు. 8 గంటల పని విధానాన్ని మార్చి, 10,12 గంటలకు సవరిస్తున్నారని పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వం ఈ పద్ధతిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని స్పష్టం చేశారు. కేంద్రం తెస్తున్న కొత్త విధానం ద్వారా రాజ్యాంగంలోని సమానత్వం, సామాజిక న్యాయం, శ్రమకు గౌరవం లాంటి అంశాల ప్రాతిపదికన దాన్ని రూపొందిస్తున్నట్టు ప్రజలను మభ్యపెట్టటం సరికాదని హితవు పలికారు. మనుస్మృతి ప్రేరణతోనే కొత్త కార్మిక విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. ఇది బిజెపి ప్రభుత్వ రాజ్యాంగ విరుద్ధ చర్యకు నిదర్శనమని తెలిపారు. నయా ఉదారవాద విధానాల అమలు కాలంలో కార్మికులు సృష్టిస్తున్న సంపదలో వేతనాలు నిష్పత్తి పడిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మరో పక్క లాభాల నిష్పత్తి అపరిమితంగా పెరుగుతున్నదని తెలిపారు. 1981-82 నుంచి వేతనాల వాట 30.27 శాతం నుంచి2023-24 నాటికి 15.97శాతానికి పడిపోయాయని పేర్కొన్నారు. అదే కాలంలో లాభాల వాటా 23.30 శాతం నుంచి 51 శాతానికి పెరిగిందని తెలిపారు. కార్మికుల శ్రమను కార్పొరేట్లు కొల్లగొడుతున్న తీరుకు ఇది అద్దం పడుతున్నదని చెప్పారు. ఈ కార్మిక విధానంలో దేశంలో మొత్తం కార్మికులను సమ్మిళితం చేస్తామనీ, వారికి సంక్షేమం కల్పిస్తామని గొప్పలు చెబితే సరిపోదన్నారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యూటీ, బోనస్ తదితర ప్రయోజనాలు పొందేందుకు కార్మికుల సంఖ్యను నిబంధనగా పెట్టటం సరికాదన్నారు. కేంద్ర కార్మిక శాఖ పార్లమెంట్‌కు సమర్పించిన గణాంకాల ఆధారంగా ఇప్పటి వరకు ఐదు వేల పరిశ్రమల్లో యాక్సిడెంట్లు జరిగాయన్నారు. 60 శాతం శ్రామిక మహిళలకు మెటర్నటీ చట్టం అమలు జరగలేదని తెలిపారు. ఐటీఈఎస్ పరిశ్రమల్లో రెండేళ్లలో మూడున్నర లక్షల మందిని తొలగించారన్నారు. ఇపిఎఫ్‌ను సరిగా అమలు చేయకపోవటంతో 35 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పని ప్రదేశాల్లో 40శాతం శ్రామిక మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. 70శాతం నిర్మాణ రంగ కార్మికులకు చట్టాలు అమలు చేయడంలేదని, 65శాతం రవాణా రంగ కార్మికులకు నిర్దిష్ట పనిగంటలు లేకుండా 12,15 గంటలు పనిచేయిస్తున్నారని తెలిపారు. దేశంలో ఇంత నగ్నంగా కార్మిక చట్టాలను ఉల్లంఘన జరుగుతుంటే వీటిని నియంత్రించి తగిన తనిఖీలు చేసి, కార్మికుల హక్కులను కాపాడాల్సిన కేంద్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉమేశ్ మాట్లాడుతూ కొత్త కార్మిక విధానం ప్రకారం .. నాలుగు లేబర్‌కోడ్ల అమలు చేసి, కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. మనుధర్మ శాస్త్రంలాంటి సిద్ధాంతాన్ని జోడించి కార్మిక వర్గాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. పదేండ్ల కాలంలో రిజిష్టరయిన పరిశ్రమల సంఖ్య తగ్గిందన్నారు. పది, పదేహేనేండ్లుగా కనీస వేతనాలను సవరించలేదని చెప్పారు. ద్వైపాక్షిక కమిటీల సమావేశాలను 2015 నుంచి జరపటం లేదన్నారు.

సాయిబాబు మాట్లాడుతూ పెట్టుబడి దారి విధానానికి కార్మిక వర్గం బలిపశువులు కాబోతున్నారని తెలిపారు. లాభాల శాతం పెరగటం, వేతనాల శాతం పెరగటమంటే దోపిడీ పెరగటమేనని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కనీస పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కూడా అమలు చేయటం లేదని విమర్శించారు. ఐఎల్ఓను సమావేశ పర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నదని చెప్పారు. కేరళ ప్రభుత్వ తరహాలో తెలంగాణ, ఆంధ్ర ప్రభుత్వాలు ఈ విధానాన్ని తిరస్కరించాలని డిమాండ్ చేశారు.

చుక్క రాములు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక వర్గంపై దాడి తీవ్రతరం చేసిందన్నారు. ప్రయివేటు పెట్టుబడి వస్తేనే అభివృద్ధి కొనసాగుతుందని ఊదరగొడుతున్నారని తెలిపారు.పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కార్యదర్శి జె వెంకటేశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రయివేటు కాలేజీల నిరవధిక బంద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిల సాధన కోసం సోమవారం నుంచి ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలు నిరవధిక బంద్‌ను పాటిస్తున్నాయి. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బకాయిలు రూ.900 కోట్లు బకాయిలు విడుదల చేయకపోవడంతో అనివార్యంగా ఈ నిర్ణయానికి వచ్చాయి. ఫీజు బకాయిల్లో టోకెన్లు ఇచ్చిన నిధులు రూ.1,200 చెల్లించాల్సి ఉండగా వీటిని రెండు దశల్లో రూ.600 కోట్లు దసరా నాటికి, మిగిలిన రూ.600 కోట్లు దీపావళి నాటికి విడుదల చేస్తామని సర్కారు హామీ ఇచ్చింది. రూ.300 కోట్లు మాత్రమే విడుదల చేసింది. దీంతో ఆదివారం నాటికి మిగిలిన బకాయిలు విడుదల చేయాలని ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించింది. ఫీజు బకాయిల్లో 50 శాతం తక్షణమే విడుదల చేయాలని, మార్చి నాటికి మిగితా 50 శాతం విడుదల చేయాలని సమాఖ్య కోరింది. నిధులు విడుదల చేయకపోగా విజిలెన్స్ తనిఖీలు చేపడతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నదని సమాఖ్య చైర్మన్ రమేశ్ బాబు తెలిపారు. దీంతో ఫీజు బకాయిల విడుల కోసం రాష్ట్రంలోని ఫార్మసీ, లా, ఎంబిఎ, ఎంసిఎ, బిబిఎ, డిగ్రీ, పీజీ, నర్సింగ్, పాలిటెక్నిక్, బిఇడి, ఎంఇడి తదితర ప్రయివేటు కాలేజీ నిరవధిక బంద్ బాట పట్టాయి. నిరవధిక బంద్‌తో ప్రభుత్వంలో కదలిక రాకపోతే 6న హైదరాబాద్‌లో లక్ష మంది సిబ్బందితో సమావేశం, 10 లేదా 11న 10 లక్షల మంది విద్యార్థులతో సభ నిర్వహించనున్నారు.

మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకం

• ఆమెను ప్రపంచానికి పరిచయం చేద్దాం • కుటుంబాన్ని, ఉద్యమాలను సమన్వయం చేసిన మహిళ

- ‘ది ఫైర్ ఆఫ్ డెఫియెన్స్’ పుస్తకావిష్కరణలో ఎస్ పుణ్యవతి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, ఐద్వా వ్యవస్థాపకుల్లో ఒకరైన మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకమని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి కొనియాడారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ‘ది ఫైర్ ఆఫ్ డెఫియెన్స్’ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరోచిత పోరాటానికి మారుపేరుగా నిలిచిన మల్లు స్వరాజ్యం జీవితాన్ని ప్రపంచమంతా తెలుసుకునేలా ఆమె జీవితం, ఉద్యమ రచనలను ఇంగ్లీష్‌లోకి రావడం ముదావహమన్నారు. ప్రపంచంలో అక్కడక్కడా తలెత్తిన చిన్న చిన్న పోరాట ఘట్టాలను కూడా వందలాది మంది రచయితలు భిన్న కోణాల్లో ఆవిష్కరించి ప్రపంచానికి పరిచయం చేస్తున్నారంటూ మేరీ హ్యారీ జోన్స్ పోరాటాన్ని ఉదహరించారు. ప్రాణాలు కోల్పోయి, కుటుంబాలు ఛిద్రమైన ప్రజల కోసం నిలబడ్డ తెలంగాణ సాయుధ పోరాట వీరుల చరిత్ర నేటి తరానికీ, ప్రపంచానికి పూర్తిగా తెలియకపోవడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మన గ్రామాల్లో జరిగిన పోరాటం, అందులో మహిళలు, పిల్లల పాత్రలు లిఖితం కావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. అజ్ఞాతంలో పోరాడిన మల్లు స్వరాజ్యం జనారణ్యంలోనూ పోరాడిందని తెలిపారు. కుటుంబానికి కష్టమొచ్చినా భర్తను పోరాటం నుంచి వెనక్కి రావాలని కోరుకోలేదనీ, కుటుంబ బాధ్యతలన్ని తానే మోసిందని గుర్తుచేశారు. జీవితానుభవం, ఉద్యమానుభవం, సైద్ధాంతిక అవగాహన నుంచి భావ ప్రధానంగా సరళమైన, వ్యవహారిక భాషలో తెగింపుతో సామాన్యుల కోసం నిలబడిన మల్లు స్వరాజ్యం జన నాయకురాలిగా నిలిచిపోయారని గుర్తుచేశారు. ఆమె తుపాకి పట్టినా, నాగలి పట్టినా, పిల్లలను కనిపెంచినా, కుటుంబ భారం మోసినా అన్ని విషయాలను సమన్వయం చేసుకుని జీవించినమహిళగా ఆమె జీవితంలో అందరూ అనుసరించాల్సిన, అనుకరించాల్సినవే ఉన్నాయని చెప్పారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చాలా మంది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం గురించి, ఆ పోరాటంలో మహిళల పాత్ర గురించి తెలుసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. మల్లు స్వరాజ్యం కార్యకర్తలను తనతో సమానంగా చూసుకునేదని గుర్తుచేశారు. ఆ చరిత్రను కనుమరుగు కాకుండా ముందుకు తీసుకెళ్లాలని ఆమె సూచించారు. ఐద్వా సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ మాట్లాడుతూ ఉత్తర భారతదేశ పోరాట ఘట్టాలు తెలుగులోకి వస్తున్నాయనీ, అదే విధంగా స్థానిక పోరాటాలను వారికి తెలుసులే అనువాదాలు ఎక్కువగా జరగాలని ఆకాంక్షించారు. మల్లు స్వరాజ్యం జీవితం చదివిన ప్రతిసారి ఒక్క విషయం అర్థమై స్ఫూర్తి పొందుతామని తెలిపారు. తోడబుట్టిన అక్కకు ఆస్తిలో వాటా కోసం కొట్లాడిన ఆమె దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ప్రభుత్వంతో పోరాడి మహిళలకు కావాల్సిన ప్రధానమైన ఆరు డిమాండ్లను సాధించారని గుర్తుచేశారు. మనిషిలో చాలా శక్తి ఉంటుందనీ, మల్లు స్వరాజ్యానికి పరిపూర్ణ జీవితమని కొనియాడారు. భూమిక ఎడిటర్ కొండవీటి సత్యవతి పుస్తకాన్ని పరిచయం చేశారు. వయస్సు పెరిగిన ఉత్సాహం తగ్గనీ, ముక్కుసూటిగా మాట్లాడే మల్లు స్వరాజ్యం వ్యక్తిత్వం స్ఫూర్తినిస్తుందని చెప్పారు. అలుపెరగని పోరాట కెరటం,

ప్రజలను చదివిన జనం మనిషి, భూస్వాముల దాష్టీకాలకు వ్యతిరేకంగా నిలిచిన భూస్వామి కూతురు, ప్రజలు గుండెల్లో దాచుకున్న గొప్ప నాయకురాలు అని గుర్తుచేశారు.

ప్రజలే బంధువులుగా బతికిన మల్లు స్వరాజ్యం : మల్లు లక్ష్మి

ముళ్లబాటను ఛేధించుకుంటూ ముందుకెళ్లిన ఆదర్శవంతమైన జీవితం మల్లు స్వరాజ్యానిదని ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. “ఎదురయ్యే సమస్యలతో క్షణం బాధపడ్డ వెంటనే తేరుకుని కార్యాచరణకు పూనుకునేది. తండ్రి, అన్న, భర్త చూపించిన బాటలో భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా నిలబడింది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం తర్వాత జీవితం గడపడానికి అనేక కష్టాలను ఎదుర్కొన్నది. దళితులు, అణగారిన వర్గాల ఇండ్లలో భోజనం చేస్తుందని బంధువులు వెలివేసినా వెనుదిరగలేదు. ప్రజలను బంధువులుగా భావించింది. నన్ను తల్లిగా, అత్తగా, స్నేహితురాలిగా చదివించింది. ప్రోత్సహించింది. అన్ని విధాలుగా అండగా నిలిచింది. బాలికలు ఆత్మరక్షణ శిక్షణ, కుటుంబాలకు కౌన్సిలింగ్ అవసరమని ఎప్పుడూ చెప్పేది. ఆమె ఆశయాలను కొనసాగిద్దాం. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఇప్పటికే ప్రభుత్వానికి మల్లు స్వరాజ్యం పేరుతో ఎకరం స్థలం కేటాయించాలనీ, ట్యాంక్‌బండ్‌పై ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించాలని కోరాం...” అని మల్లు లక్ష్మి తెలిపారు. ది ఫైర్ ఆఫ్ డెఫియెన్స్ పుస్తకాన్ని తీసుకురావడానికి అహర్నిశలు పని చేసిన హైదరాబాద్ బుక్ ట్రస్ట్ గీతారామస్వామికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లు స్వరాజ్యం పిలుపుతో ఉద్యమంలోకి వచ్చిన, కలిసి పని చేసిన పలువురు ఆమెతో తమకున్న అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రత్నమాల, సీనియర్ నాయకురాలు డి.ఇందిర, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం వినోద, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి శశికళ, వై వరలక్ష్మి, షబాన బేగం, విమల, బొప్పని పద్మ, లక్ష్మయ్య, గౌరి, విజయమ్మ, రాజలక్ష్మి, ఉదయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎంపి క్లినిక్‌లలో ఎంబిబిఎస్ డాక్టర్లు..!

- చదివిన కోర్సు ఒకటి.. చేసే ప్రాక్టీస్ మరొకటి!
- నిబంధనలకు విరుద్ధంగా స్పెషాలిటీ క్లినిక్‌లు
- గ్రేటర్ హైదరాబాద్‌లో విచ్చలవిడిగా నిర్వహణ
- ఉన్నతాధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- మెడికల్ కౌన్సిల్ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్లినిక్‌లకు గ్రేటర్ హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్.. రోజుకో చోట, గల్లికో క్లినిక్ వెలుస్తుండటం గమనార్హం. ఈ క్లినిక్‌లలో పని చేసేవారికి చదివిన కోర్సుతో సంబంధం లేకుండా ఉంటోంది. ఒక కోర్సు చదివి.. మరో కోర్సుపై ప్రాక్టీస్ చేస్తున్న పరిస్థితి నెలకొంది. నగరంలో సగానికిపైగా క్లినిక్‌ల్లో ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ‘దొరికితే దొంగ.. దొరక్కపోతే దొర’ అనే తరహాలో వ్యవహారం గుట్టుగా సాగించేస్తున్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నా.. పెద్దగా ఫలితంగా లేకుండా పోతోంది. తెలంగాణ వైద్య మండలి తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

విచ్చలవిడిగా క్లినిక్‌లు

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విచ్చలవిడిగా క్లినిక్‌లు వెలుస్తున్నాయి. చవివిన కోర్సుతో సంబంధం లేకుండా ప్రాక్టీస్ చేసేస్తున్నారు. ఓ డాక్టర్ నగరంలో న్యూరాలజీ క్లినిక్ పేరిట వైద్యం అందిస్తున్నారు. ఈ డాక్టర్ ఎండి బయోకెమిస్ట్రీ కోర్సు పూర్తి చేసినట్టు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయ్యి ఉంది. కానీ న్యూరాలజీ క్లినిక్‌ను నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన కోర్సు, కనీసం జనరల్ మెడిసిన్ వంటి పీజీ కోర్సులేవీ వారు చేయలేదు. యథేచ్ఛగా న్యూరాలజీ పేషెంట్లకు చికిత్స అందించేస్తున్నారు. పైగా డిస్ ప్లే బోర్డులో పిజిడిజిఎం (జీరియాట్రిక్స్) అని పొందుపర్చడం గమనార్హం. ఈ పీజీ కోర్సుతో సూపర్ స్పెషాలిటీ విభాగంలో న్యూరాలజీకి చికిత్స చేయడం నిబంధనలకు విరుద్ధం. మెడికల్ గైడ్‌లైన్స్ ప్రకారం స్పష్టమైన బోర్డు ఏర్పాటు చేయాలి. కానీ ఈవేమీ జరగడం లేదు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ రూల్స్‌ను కూడా బ్రేక్ చేసినట్టే అవుతుంది. ఇలాంటి క్లీనిక్స్‌పై ఇప్పటికే ఖమ్మంతో పాటు ఇతర జిల్లాల డీఎంఅండ్‌హెచ్‌లకు ఫిర్యాదు కూడా అందినట్టు సమాచారం.

కోర్సుకు, చికిత్సకు సంబంధం లేదు

మెడికల్ కౌన్సిల్ తనిఖీల్లో అధికారులకు విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నగరంలోని కొన్ని ప్రయివేటు క్లీనిక్‌లలో అర్హత లేని డాక్టర్లు వైద్యం అందిస్తుండగా, మరికొన్ని చోట్ల కోర్సుకు, అందిస్తున్న చికిత్సకు అసలు సంబంధం ఉండటం లేదని తేలింది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 550 హాస్పిటల్స్‌పై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా.. అందులో గ్రేటర్ నుంచే ఉండటం గమనార్హం. మరికొందరు ఆర్ఎంపిలు నిర్వహిస్తున్న క్లీనిక్స్‌కు ఎంబిబిఎస్ డాక్టర్లు వచ్చి వైద్యం అందిస్తున్నారు. ఆర్ఎంపికి ఎంబిబిఎస్ వైద్యులు సహకరించడం రూల్స్ బ్రేక్ చేయడమే అవుతుంది. ఇటీవల రంగారెడ్డి జిల్లాలోని ఓ క్లినిక్‌లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం తనిఖీలు నిర్వహించగా.. అర్హత లేని ఆర్ఎంపిపై ఎన్ఎంసి యాక్ట్ 34, 54 ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, సహకరించిన డాక్టర్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. కొన్ని రోజుల నుంచి మెడికల్ కౌన్సిల్ తనిఖీలు నిర్వహిస్తున్నా.. కొన్ని క్లీనిక్స్‌కు ఎలాంటి భయం లేకుండా పోయింది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూనే తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి.

వెలుగులోకి విస్తుపోయే నిజాలు

గ్రేటర్ హైదరాబాద్‌లో చాలా మంది ఎంబిబిఎస్ వైద్యులు ఆర్ఎంపిల క్లీనిక్‌లలో వైద్యం అందిస్తున్నట్టు మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఇలాంటి క్లీనిక్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఒక కోర్సు చేసి మరో విభాగానికి సంబంధించిన వైద్యం అందిస్తున్నారు. పైగా సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించడం గమనార్హం. ఇలాంటిది అత్యంత ప్రమాదకరమనీ, ప్రజలను మోసం చేసేందుకు కొందరు డాక్టర్లు ఇలాంటి ట్రిక్స్‌ను ఎంపిక చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందని కొందరు సీనియర్ వైద్యులు చెబుతున్నారు. రాష్ట్ర రాజధానిలో ఇంత నిర్లక్ష్యంగా వైద్యం అందించడాన్ని సర్కార్ సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని సీనియర్ వైద్యులు కోరుతున్నారు.

పెద్దలను వదిలి పేదలపై పడ్డ హైడ్రా

- 500 రోజుల్లో మళ్లీ కెసిఆర్ ప్రభుత్వం
- బాధ్యతతో హైడ్రా బాధితులకు న్యాయం చేస్తాం
- హైడ్రా అరాచకాలపై కెటిఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పెద్దల జోలికి వెళ్లకుండా కేవలం పేదలపై అరాచకాలకు పాల్పడుతుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన హైడ్రా అరాచకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 రోజుల్లో మళ్లీ కెసిఆర్ ప్రభుత్వం వస్తుందని, బాధ్యతతో హైడ్రా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

గత కేసీఆర్ పాలనలో నగరం నిర్మాణాలతో నిండిపోయిందని గుర్తుచేశారు. సచివాలయం, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, 42 ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు బీఆర్ఎస్ ప్రభుత్వమే నిర్మించిందని తెలిపారు. రేవంత్ రెడ్డి సర్కారు వచ్చాక ఒక్క నిర్మాణం చేపట్టలేదని తెలిపారు. పేదల ఇండ్లను అత్యంత దయనీయంగా కూల్చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దలను మాత్రం వదిలేస్తున్నదని విమర్శించారు. “రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెరువును పూడ్చి ఇల్లు కట్టారు. మరో మంత్రి వివేక్ కూడా హిమాయత్ సాగర్ చెరువు వద్ద ఇల్లు కట్టుకున్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చెరువు మధ్యలోనే ఇల్లు కట్టుకున్నారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చెరువులోనే ఇల్లు కట్టుకున్నారు. రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి దుర్గం చెరువు ఎఫ్‌టిఎల్ లోపల ఇల్లు కట్టుకున్నారంటూ...” వారికి నోటీసులు ఇచ్చే ధైర్యం హైడ్రా చేస్తుందా? అని కెటిఆర్ ప్రశ్నించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి గాజులరామారంలో ఉన్న 11 ఎకరాలకు ప్రభుత్వమే అండగా ఉందని కేటీఆర్ ఆరోపించారు. యుపీలో బుల్డోజర్ తన శరీరంపై నుంచే వెళ్లాలని అడ్డుకుంటున్న రాహుల్ గాంధీ తెలంగాణలో పేదల ఇండ్లపైకి బుల్డోజర్ వెళ్లకుండా రేవంత్ రెడ్డికి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. తప్పు జరిగితే కూలగొట్టడం తప్పనీ, రెగ్యులరైజ్ చేయాలన్న రేవంత్ రెడ్డి ఇప్పుడెందుకు కూలగొడుతున్నారని ప్రశ్నించారు.

టిజెటిఎఫ్ నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మోరం వీరభద్రరావు, జాడి శ్రీనివాస్ నియమితులయ్యారు. టిజెటిఎఫ్ నూతన కమిటీని జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఆదివారం ప్రకటించారు. టిజిటిఎఫ్ విద్యారంగ వికాసానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. వీరి నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా బుర్ర రమేష్ గౌడ్, కోశాధికారిగా ఘనపురం దేవేందర్‌ను నియమించారు.

తెలంగాణ జాగృతిలో బిసి నాయకుల చేరికలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత సమక్షంలో ఆదివారం పలువురు బిసి నాయకులు జాగృతితో చేరారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొరిగే నర్సింహ, గొరిగే రాధిక, మేడే సరిత, మేడే బాపురాజు, వీరమల్ల శారద, శివ పటేల్ సహా పెద్ద సంఖ్యలో జాగృతిలో చేరారు. కవిత బీసీల కోసం చేస్తున్న పోరాటానికి మద్దతిస్తామని వారు ప్రకటించారు.

వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలి

- డిహెచ్ డాక్టర్ డి రవీంద్ర నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద ప్రభావిత ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటూ వైద్యాధికారులు సిబ్బంది వారం రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ డి రవీంద్ర నాయక్ ఆదేశించారు. ఆదివారం ఆయన హనుమకొండ, వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ ఎ అప్పయ్య, డాక్టర్ బి సాంబశివరావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మాలికను మూడు రోజులుగా వారి పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే వివరాలు, నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు, క్యాంపులకు చికిత్స నిమిత్తం ఎలాంటి సమస్యలతో వస్తున్న తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ముఖ్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజారెడ్డి తీసుకుంటున్న చర్యలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నీరు నిలువ ఉండటం, నీరు-ఆహార పదార్థాలు కలుషితం కావడం, పరిశుభ్రత తదితర సమస్యల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని, కార్పొరేషన్ సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తూ ఉండాలన్నారు. ప్రోగ్రాం అధికారులు క్షేత్రస్థాయిలో గృహ సర్వే, వైద్య శిబిరాల నిర్వహణ, పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవడంలో వైద్యాధికారులు, సిబ్బందితో సమన్వయంగా పని చేయించాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ డిఎంహెచ్ఒ డాక్టర్ ఏ అప్పయ్య, వరంగల్ డిఎంహెచ్వో డాక్టర్ బి సాంబశివరావు అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ టి మదన్‌మోహన్‌రావు, టిబి నియంత్రణాధికారి డాక్టర్ హిమబిందు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇక్తదార్ అహ్మద్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ మంజుల, జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డి, వరంగల్ డిప్యూటీ డిఎంహెచ్ఒలు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రిన్సిపల్ వేధింపులు భరించలేం..

- షాద్‌నగర్ చౌరస్తాలో గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థుల ధర్నా
- విద్యార్థిపై చేయి చేసుకున్న మహిళా కానిస్టేబుల్
- ఆగ్రహంతో కానిస్టేబుల్ జుట్టు పట్టి ఈడ్చుకెళ్లిన విద్యార్థులు



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురుకుల విద్యార్థులపై ప్రిన్సిపల్ వేధింపులు భరించలేక సాంఘిక సంక్షేమ ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కమ్మదనం గ్రామ శివారులో నాగర్‌కర్నూల్ సాంఘిక సంక్షేమ ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలను ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపల్ వేధింపులతో విసిగివేసారిన విద్యార్థులు.. ఆదివారం షాద్‌నగర్ పట్టణ ముఖ్య కూడలి వరకు కాలినడకన విద్యార్థులంతా ర్యాలీ నిర్వహించారు. ‘ఈ ప్రిన్సిపల్ మాకొద్దు’ అంటూ అక్కడే ఆందోళనకు దిగారు. ‘ఇష్టం వచ్చినట్టు మా దగ్గర ప్రిన్సిపాల్ డబ్బులు వసూలు చేస్తుంది. మాకు పెట్టే భోజన విషయంలో కూడా అన్యాయం చేస్తోంది. 20 కిలోల చికెన్ తెస్తే.. మా కోసం 15 కిలోల చికెన్ మాత్రమే వండి.. మిగతాది వాళ్ళ ఇండ్లకి తీసుకెళుతున్నారు. వస్తువులను కూడా తీసుకెళ్తున్నారు. చివరికి పచ్చళ్లకు కూడా వదలడం లేదు’ అని విద్యార్థులు వాపోయారు. ‘మా కడుపు మార్చి వాళ్ల బాగుండటం ఏంటీ’ అని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పారు. అయితే విద్యార్థులు మాత్రం కదలకుండా రోడ్డుపైనే బైఠాయించారు. ‘మాకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు’ అంటూ విద్యార్థులు పట్టుబట్టి కూర్చున్నారు. గంటకు పైగా రోడ్డుపై బైఠాయించడంతో షాద్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ స్తంభించింది. విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయక్ మద్దతు తెలపగా.. వారిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

ధర్నాలో ఉద్రిక్తత

తమకు న్యాయం చేయాలని విద్యార్థులు ఆందోళన చేపట్టగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. విద్యార్థులు ఆందోళన చేస్తున్న క్రమంలో ఒక మహిళా కానిస్టేబుల్ విద్యార్థులతో వాగ్వివాదానికి దిగింది. ఓ విద్యార్థినిపై చేయిచేసుకుంది. దాంతో తీవ్ర ఆగ్రహానికి గురైన విద్యార్థినులు మహిళా కానిస్టేబుల్ జుట్టు పట్టి ఈడ్చుకెళ్లారు. ఏ విద్యార్థిపై చేయి వేసినా ఊరుకునే ప్రసక్తే లేదని గొడవకు దిగారు. ‘మేము న్యాయం కోసం వస్తే.. మాపై దాడులకు ప్రయత్నిస్తారా..’ అని పోలీసులతో సైతం గొడవకు దిగారు. అక్కడున్న పోలీసులు, ప్రజలు అడ్డు వెళ్లడంతో కానిస్టేబుల్‌ను వదిలేశారు. ధర్నా విషయం తెలుసుకున్న గురుకులాల జోనల్ ఆఫీసర్ నిర్మల ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలపై మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు సద్దుమణిగి నిరసన విరమించారు. అనంతరం జోనల్ ఆఫీసర్ గురుకులాన్ని సందర్శించారు. అడిగి పరిస్థితులపై ఆరా తీశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇచ్చారు.

ప్రిన్సిపాల్ పెట్టే ఇబ్బందులను భరించలేక పోతున్నాం

ప్రిన్సిపాల్ శైలజ పెట్టే ఇబ్బందులను మేము భరించలేకపోతున్నాం. గతంలో సూర్యాపేట ప్రాంతంలో విధులు నిర్వహించే క్రమంలో ప్రిన్సిపాల్ ఎన్నో అక్రమాలకు పాల్పడింది. ఇక్కడ కూడా అలాగే వ్యవహరిస్తోంది. మెస్‌లో ఉండే అనేక వంట సామాన్లను వాహనాల్లో తరలించడం మేము అనేక సార్లు చూశాం. ఫీజుల విషయంలో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ప్రిన్సిపాల్‌కు కొంతమంది ఉపాధ్యాయులు సపోర్టుగా ఉంటూ ఆమె చేసే ప్రతి పనిని సమర్థిస్తున్నారు. ఇలాంటి ప్రిన్సిపల్ ఉంటే విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించరు. కాబట్టి ఈ ప్రిన్సిపల్‌ని వెంటనే సస్పెండ్ చేయాలి.

ఆమోఘ, గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థి

విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతాం

షాద్‌నగర్‌లో నిర్వహిస్తున్న నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు తమకు న్యాయం చేయాలని ధర్నాకు దిగారు. ప్రిన్సిపాల్ శైలజ విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తోంది. సమస్యల సుడిగుండంలా సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల తయారైంది. విద్యార్థులు ‘మాకు న్యాయం చేయండి.. కలెక్టర్ రావాలి’ అంటూ నినాదాలు చేయడం చూస్తుంటే వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతాం.

- శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు



ఫర్నీచర్ ధ్వంసం అవుతున్న దృశ్యం

బిఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి

- యువజన నాయకులపై దాడి.. ఫర్నీచర్ ధ్వంసం
- మణుగూరులో 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి, విలువైన ఫర్నీచర్ ధ్వంసం చేసిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో 2వ సారి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రేగా కాంతారావు 2021లో బిఆర్ఎస్‌లో చేరిన తర్వాత మణుగూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆక్రమించుకున్నారంటూ పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల కాంగ్రెస్ నాయకులు సుందరయ్య నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసి ఆక్రమించుకున్నారు. పార్టీ కార్యాలయంలో ఉన్న యువజన నాయకులపై దాడి చేసి కొట్టారు. విలువైన ఫర్నీచర్ తగలబెట్టారు. ఈ సందర్భంగా దట్టమైన పొగ కమ్ముకోవడంతో చుట్టూ ఉన్న నివాస గృహాల్లో ప్రజలు, చిన్నపిల్లలు అవస్థతకు గురయ్యారు. మంటల కారణంగా పైన ఉన్న విద్యుత్ తీగలు దెబ్బతిన్నాయి. విద్యుత్ నిలిచిపోయింది. ఫస్ట్ ఫ్లోర్‌లో హార్ట్ పేషెంట్ ఉన్నారు. ఆమెని సమయస్ఫూర్తితో స్థానికులు పక్క ఇంట్లోకి తరలించారు. ఈ పరిస్థితితో మండలంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఒక్కసారిగా పట్టణమంతా ఉలిక్కిపడింది.

ఉదయం ఆరు గంటల నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాభవన్ చేరుకున్నారు. తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ విధ్వంసం సృష్టించారు. కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆక్రమించారని ఆగ్రహంతో కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అంతేకాకుండా తెలంగాణ భవన్ పేరును మూసివేసి ఇందిరమ్మ భవన్ అనే బోర్డును ఏర్పాటు చేశారు. జెండా దిమ్మెకు కాంగ్రెస్ కలర్ వేశారు. పార్టీ కార్యాలయం భవనానికి కూడా రంగులు వేసేందుకు కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. రెచ్చిపోయిన కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ దిమ్మెకు కాంగ్రెస్ కలర్ వేశారు. పార్టీ కార్యాలయం అంతర్భాగంలో ఉన్న గోడలకు వైట్ కలర్ వేశారు. దాంతో కాంగ్రెస్ నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పార్టీ కార్యాలయాన్ని తమకు అప్పచెప్పేంత వరకూ ఇక్కడ నుండి కదిలేది లేదని కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు పార్టీ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు రోడ్డుపైన అడ్డుకున్నారు. అందుబాటులో లేని సందర్భాన్ని చూసి పార్టీ కార్యాలయంపై దాడి చేశారని, ఇది పిరికిపంద చర్య అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తామని తెలపడంతో ఉద్రిక్తత నెలకొన్నది. ఒఎస్‌డి నరేందర్, డిఎస్‌పి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించారు. అధిక సంఖ్యలో పోలీసులు మోహరించారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన గురవుతున్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పోలీసు అధికారులు తెలిపారు.

ముగ్గురిని హత్య చేసి తానూ ఆత్మహత్య

- కుల్కచర్లలో దారుణం
- కుటుంబ కలహాలే కారణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కట్టుకున్న భార్య, కన్న బిడ్డలు, వదినపై పాశవికంగా వేట కొడవలితో దాడికి పాల్పడ్డాడు.. నిద్రలో ఉన్న ముగురిని విచక్షణ కోల్పోయి అతికిరాతకంగా హత్య చేసి, ఆపై తాను ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన వేపూరి యాదయ్య (38) మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం పగిడ్యాల్ గ్రామానికి చెందిన అలివేలు (32)ను 14 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి అపర్ణ, శివాణి (4) ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తలు మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గొడవపడ్డ ప్రతిసారి అలివేలు తన పుట్టింటికి వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో శనివారమూ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న అలివేలు అక్క హనుమమ్మ (40) కుల్కచర్ల వచ్చి గ్రామంలోని పెద్ద మనుషులతో పంచాయితీ పెట్టించింది. పెద్దమనుషులు యాదయ్యను మందలించి సక్రమంగా కాపురం చేసుకోవాలని సూచించారు. ఇది అవమానంగా భావించిన యాదయ్య తన పరువు పోయిందని శనివారం అర్ధరాత్రి 1.30 గంటలకు ఇంట్లో నిద్రిస్తున్న భార్య, కూతుర్లు, హనుమమ్మపై వేట కోడవలితో కిరాతకంగా దాడి చేశాడు. కుటుంబీకులను హత్య చేశానని భావించిన యాదయ్య తాను ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్ద కూతురుకు తల, చేతికి గాయాలయ్యాయి. స్పృహలోకి వచ్చిన అపర్ణ బంధువులకు, ఇరుగుపొరుగు వారికి జరిగిన ఉదాంతాన్ని తెలిపింది. స్థానికులు వెంటనే కుల్కచర్ల పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన అపర్ణను ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పరిగి డిఎస్‌పి శ్రీనివాస్, తన సిబ్బందితో ఘటనాస్థలానికి వెళ్లి ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు.

ప్రజలు చరమగీతం పాడుతారు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మణుగూరు పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి దహనం చేసిన ఘటనపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో గుండాల రాజ్యం, రౌడీయిజం పెరిగిపోయిందని మండిపడ్డారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే కెటిఆర్ ఆ జిల్లా పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావుతో ఫోన్‌లో మాట్లాడారు. 60 లక్షల మంది బిఆర్ఎస్ కుటుంబమంతా మణుగూరు పార్టీ శ్రేణులకు తోడుగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని కోరారు. త్వరలోనే మణుగూరును సందర్శిస్తానని కెటిఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రౌడీ మూకలకు, వారి అరాచకత్వానికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ తెచ్చిన రౌడీల రాజ్యం, అరాచకత్వానికి చరమగీతం పాడే రోజు దగ్గర్లో ఉందని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సైన్యంపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

భారత సైన్యంపై చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అవి నీచమైన కామెంట్స్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత ఆర్మీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి కోసం ఆర్మీని రేవంత్ రెడ్డి వాడుకుంటున్నారని మండిపడ్డారు. తమ ప్రాణాలను పణంగా మనలను సురక్షితంగా ఉంచడం వల్లే రాజకీయాలు చేసుకోగలుగుతున్నామని గుర్తుచేశారు. సరిహద్దుల్లో సైన్యం వల్లే అందరం హాయిగా కుటుంబాలతో జీవించగలుగుతున్నామని తెలిపారు. పాకిస్తాన్‌ను ఏ ఉద్దేశంతో పొగుడుతున్నారు? అని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు.